క్లుప్తంగా

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీన్ కుమార్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రమేష్‌గౌడ్, రైతు సంఘం మండల అధ్యక్షులు భూషణం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి మండల అధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బస్‌యాత్ర ఈ నెల 25న సంగారెడ్డి పట్టణానికి రానున్న సందర్భంగా గురువారం సీఐటీయూ పట్టణ కార్యాలయం అవరణలో ప్రజా సంఘాల నాయకులు కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన డబుల్ బెడ్రూం ఇళ్లల్లో ఎంతోమంది అనర్హులు ఉన్నారని, దీంతో అర్హులైన వారిని గుర్తించి కేటాయించాలని కోరారు. గతంలో ఇళ్ల పట్టాలిచ్చిన వారికి తక్షణమే పొజిషన్ చూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, శ్రీనివాస్, మోహన్‌చారి, రాము, సురేష్ పాల్గొన్నారు.

మత్స్యకారులపై దాడులు అమానుషం


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మత్స్యకారులు, నాయకులు

జహీరాబాద్ టౌన్: రాత్రి సమయాల్లో అక్రమంగా చేపలను తరలించడమే కాకుండా మత్స్యకారులపై దాడులకు పాల్పడటం అమానుషమని ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం మత్స్యకార, ముదిరాజ్ సంఘం నాయకులు పోలీసులు, అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు బాగన్న, శ్రీనివాస్, సంగప్ప, బరూర్ దత్తాత్రిలు మాట్లాడుతూ మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్ చెరువులో సహకార సంఘం ఆధ్వర్యంలో చేపలను పెంచుతున్నామన్నారు. కొంత మంది రాత్రి పూట చెరువులోని చేపలను అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకోవడంతో తమపై దాడులు చేస్తున్నారని వాపోయారు. తమపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు శంకర్, హనుమంత్, రవి, రాజు, వెంకటేశం, జగన్, రాచన్న పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

సంగారెడ్డి టౌన్: సదాశివపేట మండలం సూరారం గ్రామానికి చెందిన హలేమాభీ కుటుంబ సభ్యులకు కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల చెక్కును టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అధిక ఫీజులు తగ్గించాలి

సంగారెడ్డి టౌన్: ఢిల్లీ పబ్లిక్ సెకండరీ స్కూల్లో అధిక ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం స్కూల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఫసల్వాది గ్రామ శివారులోని ఢిల్లీ పబ్లిక్ సెకండరీ స్కూల్ యజమాన్యం జీఓ నెంబర్ 1, 9, 46, ప్రకారం ఫీజులు తీసుకోకుండా ఇష్టానుసారంగా దండుకుంటున్నారన్నారు. అడ్మిషన్ ఫీజు పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. .కార్యక్రమంలో సంగం జిల్లా అధ్యక్షుడు మహేష్ ఉపాధ్యక్షుడు సతీష్, నాయకులు శీను, ప్రవీణ్, వాణి పాల్గొన్నారు.

వట్‌పల్లి(అందోల్): ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేష్ డిమాండ్ చేశారు. జోగిపేట పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీ యింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని తెలిపారు. కార్యక్రమంలో అరుణ్, కార్తీక్, విష్ణువర్ధన్, మహిపాల్ పాల్గొన్నారు.

పటాన్‌చెరు గులాబీమయం


సీఎం కేసీఆర్ సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

పటాన్‌చెరు: ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పటాన్‌చెరు పట్టణమంతా గులాబీమయమైంది. సీఎంను స్వాగతించేందుకు వచ్చిన బీఆర్‌ఎస్ నేతలతో పట్టణం కిటకిటలాడింది. బస్టాండ్ పక్కన నుంచి సభాస్థలి వరకు నాయకులు, కార్యకర్తలతో నిండిపోయింది. ముత్తంగి నుంచి పట్టణం వరకు ఎటు చూసినా గులాబీ జెండాలు, స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలే కనిపించాయి. నియోజకవర్గ పరిధిలోని ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలు కదిలివచ్చేలా చేసిన ప్రయత్నాలు ఫలించాయి. అమీన్‌పూర్ పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను అన్ని వార్డుల నుంచి సమీకరించారు. తొలుత చైర్మన్ ఇంటి నుంచి గుంపుగా బయలు దేరారు. గ్రామాల్లో వాహనాల ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాల నుంచి పటాన్‌చెరు పట్టణానికి ఉదయం 9 గంటలకు చేరుకున్నారు. కాగా సభాస్థలికి సీఎం గంటన్నర అలస్యంగా వచ్చారు. అయినా బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు నిరీక్షించారు. వర్ష సూచన కారణంగానే షామియానా చిన్నది వేయాల్సి వచ్చిందని, వచ్చిన కార్యకర్తల్లో చాలా మంది రోడ్లపై ఉన్నారని మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. జాతీయ రహదారి పొడవునా మైక్‌లను ఏర్పాటు చేశారు. కళాకారుల బృందాల పాటలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. డీఎస్పీ స్వయంగా సంతకం చేసిన పాసులను చూపినప్పటికీ ఓ పోలీసు అధికారి మీడియావారిని సభాస్థలికి అనుమతించలేదు. ప్రెస్‌గ్యాలరీలో విలేకరులు కూర్చునేందుకు సరైన ఏర్పాట్లు చేయక పోవడంతో కొందరు నిలబడే వార్తలు సేకరించాల్సి వచ్చింది.

అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించండి


సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన పేదలందరికీ రెండు పడకల ఇళ్లు కేటాయించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి గురువారం సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు పడకల ఇళ్ల కేటాయింపులో అర్హులైన స్థానిక పేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయాలని కోరినట్లు వివరించారు. తెల్లాపూర్‌లోని వనం చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని సీఎంకేసీఆర్‌నువిజ్ఞప్తిచేసినట్టుతెలిపారు.

ఎలక్ట్రిక్ బగ్గీలో కలియ తిరుగుతూ..


డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిసరాలను బ్యాటరీ వాహనంలో తిరుగుతూ పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: కొల్లూరులో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ గృహ సముదాయంలో సీఎం కేసీఆర్ ఎలక్ట్రిక్ బగ్గీలో కలియదిరిగారు. దాదాపు 2.5 కి.మీ పరిధిలోని అన్నీ బ్లాకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ భవనాల త్రీడీ నమూనాను మున్సిపల్ శాఖా మంత్రి కె.తారకరామారావు సీఎం కేసీఆర్‌కు వివరించారు. కొల్లూరు డబుల్‌బెడ్ రూం గృహ సముదాయంలో 117 బ్లాకుల్లో 15,660 ఇళ్లు నిర్మించారు. ఇందులో 2 వేలు పటాన్‌చెరు నియోజకవర్గానికి కేటాయిస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు.

ఆహ్వానం పంపారు.. అరెస్ట్ చేశారు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో రెండు పడకల ఇళ్ల ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ రాక సందర్భంగా పోలీసులు స్థానిక కాంగ్రెస్ కౌన్సిలర్లు మయూరి, రాంసింగ్‌ను, నాయకులను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. కొల్లూర్ కౌన్సిలర్‌లు మయూరి, రాంసింగ్‌లకు ఆహ్వానం ఉన్నా పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడంతో ఇంటి నుంచి బయటకు రాలేదు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మయూరి మాట్లాడుతూ సీఎం సభ సందర్భంగా తాము కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. తమకు ఆహ్వానం పంపి హౌస్ అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. పలు సమస్యలపై తాము వినతిపత్రం అందజేయాలని అనుకున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌కు విన్నపం


సీఎంకు సమస్యలను వివరిస్తున్న ఎంపీపీ ప్రవీణ, పక్కన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): నూతనంగా ఏర్పాటైన గుమ్మడిదల మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం పటాన్‌చెరులో నిర్వహించిన సీఎం సభలో ఎంపీపీ సద్ది ప్రవీణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విన్నవించారు. మండలంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు, రైతులకు సాగునీరు, విద్యార్థులకు ఐటీఐ, జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ ఏర్పాటుతో పాటు మండల సముదాయ భవనాల నిర్మాణాలు, రైతుల కోసం గిడ్డంగుల ఏర్పాటు తదితర సమస్యలను సమస్యలను పరిష్కరించాలని సీఎంకు విన్నవించారు. దీంతో స్పందించిన సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారని ఎంపీపీ తెలిపారు.

సీఎం సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు


జిన్నారం: బొల్లారం నుంచి సీఎం సభకు వెళ్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల నుంచి పటాన్‌చెరులో గురువారం నిర్వహించిన సీఎం కేసీఆర్ సభకు భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జిన్నారం నుంచి జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్ ఆధ్వర్యంలో సభకు తరలివెళ్లారు. గుమ్మడిదల నుంచి ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు హుస్సేన్‌ల ఆధ్వర్యంలో సీఎం సభకు తరలివెళ్లారు. బొల్లారం నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో సీఎం సభకు తరలివెళ్లారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ సభకు గురువారం కార్పొరేటర్లు పుష్పనగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మూడోసారి సైతం బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సీఎంను కలిసిన నీలం మధు

వైరల్‌గా మారిన వీడియో


సీఎం కేసీఆర్‌తో నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు: చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అనుచరుల మధ్య ఫ్లెక్సీల వార్ జరుగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమైన కార్యక్రమాలు జరిగిన ప్రతీసారి రోడ్లపై ఇరువర్గాలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే కుమారుడు ఫ్లెక్సీలను ధ్వంసం చేస్తున్నాడనే వీడియో చక్కర్లు కొట్టింది. అంతకు ముందు సీఎం సభ జరిగే చోట నీలం మధు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడాన్ని ఎమ్మెల్యే వర్గం అడ్డుకుంది. సర్పంచ్ స్థాయి వ్యక్తి సీఎం సభకు సమీపంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తాడా అంటూ ఎమ్మెల్యే అనుచరులు మండిపడ్డారు. దీంతో నీలం మధు అనుచరులు ఫ్లెక్సీ తొలగింపుపై జిల్లా పోలీస్ అధికారికి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫ్లెక్సీల అంశమే కాకుండా ఇతర విషయాలపై మొత్తంగా ఇరువర్గాల మధ్య సోషల్ మీడియాలో వార్ జరుగుతోంది. సీఎంను కలిసేందుకు పటాన్‌చెరులోని ముఖ్య నాయకులందరూ ఉబలాటపడ్డారు. కానీ సీఎం పర్యటనలో నీలం మధు నేరుగా కేసీఆర్‌ను కలిశారు. ఆ వీడియో ఒకటి పటాన్‌చెరులో వైరల్‌గా మారింది. పార్టీ శ్రేణుల్లో కొందరు పని గట్టుకుని ఆ వీడియోను వైరల్ చేశారు. ఆ వీడియోలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు దగ్గరుండి మరీ నీలం మధును కేసీఆర్‌కు పరిచయం చేసినట్లు ఉండటం ఈ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. పటాన్‌చెరులో సీఎం సభ జరుగుతున్న సమయానికే ఆ వీడియో బీఆర్‌ఎస్ వర్గాల సెల్‌ఫోన్‌లలో చక్కర్లు కొట్టింది.

సేవా కార్యక్రమాలు చేయాలన్నారు

పటాన్‌చెరుటౌన్: కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవానికి విచ్చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలసి నీలం మధు పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీలో బాగా పనిచేస్తున్నావు, మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగాలని నీకు నేనున్నానంటూ ముఖ్యమంత్రి భరోసా కల్పించారని మధు తెలిపారు. కొల్లూరు కార్యక్రమం అనంతరం కొండకల్ మేద రైల్వే కోచ్ ప్రారంభానికి వెళ్తున్న వాహనాలపై ఎన్‌ఎంఆర్ యువసేన పూల వర్షం కురిపించారు. తిరిగి వస్తున్నప్పుడు కూడా పూల వర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని మూడోసారి అధికారంలోకి వచ్చేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాన్నారు.

సీఎం పర్యటన ఇలా..

పటాన్‌చెరు టౌన్: గురువారం ఉదయం 10:50 గంటలకు సీఎం కేసీఆర్ రోడ్డు మార్గంలో ప్రగతి భవన్ నుంచి బయలుదేరి కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఏరియాకు 11:20 గంటలకు చేరుకున్నారు.

- మధ్యాహ్నం 12:30 గంటలకు రోడ్డు మార్గంలో కొండకల్ మేధ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభించి పటాన్‌చెరుకు బయలుదేరారు.
- 1:54 గంటలకు రూ.200 కోట్ల నిర్మించే పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి శంకుస్థాపన మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసి చేశారు.
- శంకుస్థాపన అనంతరం సభావేదిక పైకి 2:08 గంటలకు వచ్చారు. అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు.
- మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, కార్పొరేటర్‌లు సింధు, పుష్ప రాయసముద్రం చెరువు సుందరీకరణపై సీఎంకు వినతిపత్రం అందజేశారు.
- మధ్యాహ్నం 2:33 గంటలకు బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు.
- 2:46 గంటలకు పటాన్‌చెరు నుంచి తిరిగి ప్రగతిభవన్‌కు రోడ్డు మార్గంలో వెళ్లారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే, డీసీఎంఎస్ చైర్మన్


సీఎం కేసీఆర్‌తో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

జహీరాబాద్: పటాన్‌చెరులో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన సీఎం కేసీఆర్‌ను గురువారం జహీరాబాద్ ప్రాంత ముఖ్య నేతలు కలుసుకున్నారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మైనార్టీ కమిషన్ సభ్యుడు ఎండీ తన్వీర్ సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్ నిరసనల వెల్లువ

గడిచిన తొమ్మిదేళ్లుగా ఇచ్చిన హామీలను విస్మరించి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజలను దగా చేస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీ శ్రేణులు ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా పలుచోట్ల ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఎంతోమంది అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.


నారాయణఖేడ్: సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


జహీరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు


జోగిపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


పటాన్‌చెరు టౌన్: జాతీయ రహదారిపై బైఠాయించిన కాంగ్రెస్ నాయకులు

‘బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం’


కంది: చేర్యాలలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


జహీరాబాద్: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


జహీరాబాద్ టౌన్: కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ 9 ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడానికే జన సంపర్క్ అబియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్ అన్నారు. జన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మొగుడంపల్లిల్లో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామన్న, సిద్దప్ప, మల్లికార్జున్‌స్వామి, సుదర్శన్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, అనిల్, మారుతి, భీముషా, సుధాకర్ పాల్గొన్నారు.

జహీరాబాద్: మున్సిపల్ పరిధిలో చేపట్టిన ఇంటింటా బీజేపీ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచందర్ రాజనర్సింహా అన్నారు. గురువారం పట్టణంలోని 170, 171, 172, 205, 206 పోలింగ్ బూత్‌లలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్ భండారి, రాఘవేందర్‌నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంది(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని సంగారెడ్డి నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు తెలిపారు. జన సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం కంది మండల పరిధిలోని చేర్యాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌రెడ్డి, పెంటారెడ్డి, బలరాం, భూపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో బీజేపీ నాయకుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ప్రధానమంత్రి నరేంద్రమోడీ 9ఏళ్ల పరిపాలనలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్ రెడ్డి, లక్ష్మణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన అమరుల సంస్మరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు.


జహీరాబాద్: లక్ష్మణ్‌యాదవ్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు


జహీరాబాద్: క్యాంపు కార్యాలయంలో ఇషాంత్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు


కోహీర్‌లో అమరుల సంస్మరణ దినోత్సవంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు


నారాయణఖేడ్: మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, పాలకవర్గం


జోగిపేటలో అమరులకు నివాళులర్పిస్తున్న నాయకులు


రాయికోడ్: అమరులకు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు